ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 1 జూన్ 2024



కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద



బాధ్యతలు స్వీకరించిన శివానందకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు - 7లో

ఓట్ల లెక్కింపునకు పటిష్ఠ చర్యలు

స్ట్రాంగ్‌రూమ్‌ల సమీపంలోనే కమాండ్ కంట్రోల్

- అధికారులు, అభ్యర్థులు అక్కడి నుంచే పరిశీలించే అవకాశం
- సలహాలు, సూచనలు అందించేందుకు వీలు
- ఈవీఎంలలో సాంకేతిక సమస్యలను తొలగించేందుకు సిబ్బంది నియామకం
- సీసీ కెమెరాల నిఘాలోనే మొత్తం లెక్కింపు ప్రక్రియ
- వీడియో రికార్డింగ్‌కు పూర్తైన ఏర్పాట్లు
- విధి విధానాలపై సిబ్బందికి శిక్షణ శిబిరాలు



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సూచనలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు మరో మూడు రోజులు మాత్రమే గడువుండడంతో అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమయింది. అనకాపల్లి మండలం శంకరంలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రంలో జూన్ 4న ఉదయం 8 గంటలకు జిల్లాలోని ఆరు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానానికి సంబంధించిన ఓట్లను లెక్కించనున్నారు. ప్రశాంత వాతావరణంలో లెక్కింపు ప్రక్రియ సజావుగాసాగేలా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇందు కోసం జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 1,300 మంది సిబ్బందిని నియమించింది. వారికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి వేర్వేరుగా అవగాహన కల్పిస్తున్నారు. పోటీలోని అభ్యర్థులు అదే పనిగా లెక్కింపు కేంద్రం వద్దకు వెళ్లకుండా క్లోజ్‌వైజ్ వెబ్‌కాస్టింగ్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటుచేస్తున్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌కు సమీపంలోనే వీటిని ఏర్పాటు చేయడంతో అక్కడ కూర్చుని పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిరంతరాయంగా పరిశీలించే అవకాశం కల్పిస్తున్నారు. ఒక కమాండ్ కంట్రోల్ గదిలో అభ్యర్థులు, మరో కమాండ్ కంట్రోల్ గదిలో జిల్లా ఎన్నికల అధికారులు, పరిశీలకులు మొత్తం ప్రక్రియను పరిశీలించేలా ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు వేర్వేరుగా కమాండ్ కంట్రోల్ గదులను ఏర్పాటు చేశారు. లెక్కింపులో ఏవైనా అభ్యంతరాలుంటే వెంటనే ఆర్‌ఓల దృష్టికి తీసుకువెళ్లి, నివృత్తి చేసుకునే వీలు కల్పిస్తున్నారు.

సీసీ కెమెరాల నిఘాలో...

ఓట్ల లెక్కింపు పారదర్శకంగా జరిగేందుకు వీలుగా మొత్తం ప్రక్రియ సీసీ కెమెరాల నిఘాలో కొనసాగనుంది. ఈమేరకు ప్రతి గదిలో సీసీ కెమెరాలను అమర్చుతున్నారు. అంతేకాకుండా లెక్కింపు ప్రక్రియను వీడియో కెమెరాలతో రికార్డింగ్ చేయనున్నారు. ఎన్నికల పరిశీలకులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఏజెంట్లు, అభ్యర్థుల పర్యవేక్షణలో లెక్కింపు చేపడతారు.

తొలివిడత ర్యాండమైజేషన్ పూర్తి

లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే తొలిదశ ర్యాండమైజేషన్ పూర్తిచేశారు. రెండోదశ ఆదివారం నిర్వహిస్తారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు రోజున ఉదయం 5 గంటలకు మరోసారి ర్యాండమైజేషన్ జరగనుంది. ఈవీఎంల లెక్కింపులో సాంకేతిక కారణాలతో ఇబ్బందులు తలెత్తితే పరిష్కరించేందుకు వీలుగా బెల్ ఇంజినీర్లను అందుబాటులో ఉంచుతున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారుల పరస్పర సహకారంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మొత్తం ప్రక్రియను పూర్తిచేసేందుకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీకృష్ణ దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా ఎన్నికల అధికారులు, ఆర్‌ఓలతో అనేక పర్యాయాలు సమావేశాలు నిర్వహించి, సలహాలు, సూచనలు ఇచ్చారు.

పెన్షన్.. టెన్షన్!

5వ తేదీ వరకు పంపిణీకి ఏర్పాట్లు

- 1,93,349 మందికి బ్యాంకు ఖాతాల్లో జమ
- ఇళ్లకు వెళ్లి 71,177 మందికి అందజేయనున్న యంత్రాంగం



(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి) లబ్ధిదారులకు సకాలంలో పెన్షన్ అందించేందుకు వీలుగా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది... సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రెండు నెలలుగా సామాజిక పెన్షన్‌దారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెన్షన్ ఎప్పుడొస్తుందోనని ఎదురుచూడాల్సి వచ్చింది. ఇంటి వద్ద ఇస్తారా, బ్యాంకులకు వెళ్లాలా లేక సచివాలయాల్లో అందిస్తారా అనే సందిగ్ధం నెలకొనేది. ఎన్నికల కారణంగా పెన్షన్ల పంపిణీలో జాప్యం చేసిన అధికారులు మేలో సకాలంలో అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఈనెల కూడా ప్రక్రియ సాఫీగానే సాగుతుందని భావిస్తున్నారు.

జిల్లాలో మే నెలకు సంబంధించి 2,64,526 మంది సామాజిక పెన్షన్ లబ్ధిదారులుండగా, వారిలో 71,177 మంది ఇళ్లకు సచివాలయ సిబ్బంది వెళ్లి పెన్షన్ అందజేయనున్నారు. మరో 1,93,349 మందికి బ్యాంకు ఖాతాల్లో నగదు జమకానుంది. ప్రభుత్వం మే నెలకు సంబంధించిన పెన్షన్ మొత్తం రూ.95 కోట్లు విడుదల చేసిందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శశీదేవి తెలిపారు. శనివారం నుంచి లబ్ధిదారులకు సాఫీగా పెన్షన్లు అందిస్తామన్నారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ పెన్షనర్లకు ఇబ్బంది లేకుండా పంపిణీ ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నట్టు ఆమె స్పష్టం చేశారు. ఇంటి వద్ద పెన్షన్ అందజేసేందుకు పంచాయతీ కార్యదర్శులు, వార్డు పరిపాలనా కార్యదర్శులు సంబంధిత బ్యాంకు ఖాతాల నుంచి శుక్రవారమే నగదు తీసుకున్నారని, శనివారం నుంచి ఐదో తేదీ వరకు అందిస్తారన్నారు.

ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,

9985411639

ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.

9985411029

భారీగా బెట్టింగ్



ఎన్నికల ఫలితాలపై విపరీతంగా పందాలు

- కూటమి గెలుస్తుందని అత్యధికులు...
- వైసీపీపై కాసేందుకు ఎవరూ ముందుకురాని పరిస్థితి
- దాంతో కీలక నియోజక వర్గాల ఫలితాలు, ప్రముఖుల మెజారిటీలపై పందెంరాయుళ్ల దృష్టి
- శ్రీకాకుళం, చీపురుపల్లి, విశాఖపట్నం నార్త్, వెస్ట్, మాడుగుల, పాడేరు నియోజకవర్గాల్లో గెలుపు/ఓటములపై...
- చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్‌లకు లభించే మెజారిటీలపైనా బెట్టింగ్
- టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీలకు లభించే ఎంపీ స్థానాలపై కూడా...
- చేతులు మారుతున్న రూ.కోట్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మరో మూడు రోజుల్లో వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో బెట్టింగ్ రాయుళ్లు స్పీడ్ పెంచారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రూ.కోట్లలో బెట్టింగ్ జరుగుతోంది. సాధారణంగా ఏ పార్టీ అధికారంలోకి వస్తుందన్న దానిపైనే పందాలు సాగు తుంటాయి. ఈసారి కూడా ఏప్రిల్ నెలాఖరు వరకూ అలాగే నడిచింది. అయితే, మే నెల ప్రారంభం నుంచి మాత్రం వైసీపీ గెలుస్తుందని బెట్టింగ్ కాసేందుకు చాలామంది వెనకడుగు వేస్తున్నారు. మరీ ముఖ్యంగా పోలింగ్ తరువాత కూటమి విజయం సాధిస్తున్న టాక్ రావడంతో వైసీపీకి అనుకూలంగా బెట్టింగ్ వేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో బెట్టింగ్ రాయుళ్లు ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు.

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏ పార్టీకి ఎక్కువ సీట్లు వస్తాయి?, చీపురుపల్లి, ఎచ్చెర్ల, గజపతినగరం వంటి నియోజక వర్గాల్లో ఎవరు గెలుస్తారు?, అలాగే ఉమ్మడి విశాఖ నగర పరిధిలోని నార్త్, పశ్చిమ నియోజకవర్గాల ఫలితాలపై పందాలు వేస్తున్నారు. విశాఖపట్నం టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సాధించే మెజారిటీ, అలాగే అనకాపల్లి జిల్లా మాడుగుల, అల్లూరి జిల్లా పాడేరు నియోజక వర్గాల్లో ఎవరు గెలుస్తారన్న దానిపై బెట్టింగ్ కడుతున్నారు.

కూటమి వైపు జోరుగా పందాలు..

ఎన్నికల్లో కూటమి విజయం సాధిస్తుందన్న అభిప్రాయాన్ని ఎక్కువ మంది వ్యక్తం చేస్తుండడంతో.. అటువైపు పందాలకు అత్యధికులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే వైసీపీ గెలుస్తుందని పందెం కాసేందుకు ఎవరూ దొరక్క పోవడంతో...హోరాహోరీగా పోటీ జరిగిన నియోజక వర్గాలపై దృష్టిపెట్టారు. శ్రీకాకుళం జిల్లాలో మంత్రి ధర్మాన ప్రసాద రావు, చీపురుపల్లిలో మంత్రి బొత్స సత్యనారాయణల గెలుపు/ ఓటములపై, అలాగే పలాస, నరసన్నపేటల్లో కూటమి అభ్యర్థుల విజయంపై జోరుగా పందాలు సాగుతున్నాయి. శ్రీకాకుళం ఎంపీ స్థానంపై పందెం కాసేందుకు ... మిగతా 8వ పేజీలో

చోడవరంలో ఓపెన్ బార్లు

మైదానాల్లో మద్యం సేవిస్తున్న మందుబాబులు

- దృష్టి సారించని పోలీసులు
- స్థానికులు, వాకర్స్‌కు అవస్థలు



లక్ష్మీపురం రూట్లో మైదానం వద్ద మందుబాబులు తాగిపాడేసిన బీరుసీసాలు, ప్లేట్లు

చోడవరం, మే 31: చోడవరం శివారు ప్రాంతాలు ఓపెన్ బార్లను తలపిస్తున్నాయి. లక్ష్మీపురం, చీడికాడ రోడ్డు పరిసరాల్లోని మైదానాలను మందుబాబులు అడ్డాలుగా మార్చుకుంటున్నారు. చీకటి పడితే చాలు వివిధ ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో మద్యం ప్రియులు ఇక్కడికి చేరుకుని యథేచ్ఛగా మద్యం సేవిస్తుండడంతో ఆయా రహదారులపై ప్రయాణిస్తున్నవారు, సమీపంలోని స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నికల హడావిడిలో ఉన్న పోలీసులు పట్టించుకోకపోవడంతో మందుబాబులు రెచ్చిపోతున్నారు. అంతేకాకుండా లక్ష్మీపురం రోడ్డు, చీడికాడ రోడ్డు పరిసరాల్లో పగటివేళల్లోనూ మందుబాబులు పార్టీలతో హడావిడి చేస్తున్నారు. తాగిన మద్యం సీసాలను అక్కడే పగలగొట్టి విసిరేయడం, ఆకులు, ప్లేట్లను పారేసి పరిసరాలను కలుషితం చేస్తున్నారు. దీనివల్ల ఆ ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. ఫలితంగా తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది.

శివారు ప్రాంతాల్లో రెచ్చిపోతున్న మందుబాబుల చర్యలతో స్థానికులు, వాకింగ్ చేసే మహిళలు పురుషులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రాత్రి వేళల్లో ఈ రెండు రూట్లలో పోలీసులు ప్రత్యేకంగా గస్తీ తిరిగేవారు. మద్యం సేవించే వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించేవారు. పోలీసులు ఎప్పుడు వస్తారో తెలియక మందుబాబులు ఓపెన్ బార్లకు స్వస్తి పలికారు. అయితే పోలీసు యంత్రాంగమంతా ఎన్నికలు, ఓట్ల లెక్కింపు హడావుడిలోనే ఉండిపోవడంతో గత రెండు నెలలుగా ఈ ప్రాంతాల్లో మందుబాబులు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు వీటిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో మెరిశారు

బంగారు పతకాలు సాధించిన పూర్ణ, రామలక్ష్మి



బంగారు పతకంతో పూర్ణ



బంగారు పతకంతో రామలక్ష్మి

అనకాపల్లి టౌన్, మే 31: మంగళగిరిలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన క్రీడాకారులు బంగారుపతకాలను దక్కించుకున్నారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బద్రీనాథ్ తెలిపారు. మహిళల 57 కిలోల విభాగంలో రాజనాల పూర్ణ, 57 కిలోల బెంచ్‌ప్రెస్ పోటీల్లో జె.రామలక్ష్మి బంగారు పతకాలు సాధించారు. మాస్టర్స్ 56 ఏళ్ల విభాగంలో ఎం.శ్రీనివాస్‌కు కూడా బంగారం పతకం దక్కిందన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు విజేతలను అభినందించారు.

వినిపించదా.. శారదా ఘోష!

వ్యర్థాలతో నిండి దుర్భరంగా మారిన నది

- ఎటు చూసినా చెత్తా చెదారం
- పరిశుభ్రతపై దృష్టి సారించని యంత్రాంగం

అనకాపల్లి టౌన్, మే 31: జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న శారదానది ప్రాంతం దుర్భరంగా మారింది. పట్టణ పరిధిలోని నదీ ప్రాంతమంతా చెత్తా చెదారం, వ్యర్థాలతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. రాత్రి వేళల్లో పట్టణంలోని పలు హోటళ్ల నిర్వాహకులు వ్యర్థాలను నదిలో నేరుగా వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నీటి ప్రవాహం తక్కువగా ఉండడంతో వ్యర్థాలు ఎక్కడికక్కడ పేరుకుపోయి కుళ్లిపోవడంతో నదీ జలాలు కలుషితమవుతున్నాయి.



వంతెన కానాల వద్ద పేరుకుపోయిన చెత్త

నదిని ఆనుకుని జీవీఎంసీ అధికారులు శాంతిపార్కును అభివృద్ధి చేశారు. ఇక్కడ ప్రశాంత వాతావరణంలో సేదతీరేందుకు అవకాశం లేకపోవడంతో పట్టణవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.



నది మెట్ల ఎదుట నీటిలో పేరుకుపోయిన వ్యర్థాలు

అంతేకాకుండా మృతులకు దశ దిన కార్యక్రమాలు చేపట్టేందుకు చాలామంది నది వద్దకు వస్తుంటారు. వారి పూజలు ముగిసిన తరువాత స్నానమాచరించాల్సి ఉంటుంది. నది దుర్భరంగా మారడంతో కనీసం నదిలో దిగేందుకే ఎవరూ సాహసించడం లేదు. గట్టుకు ఆనుకుని ఉన్న ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని బోరు వద్దకు వెళ్లి స్నానాలు చేయాల్సిన పరిస్థితి. వినాయక ఘాట్, పాతవంతెన కానాల ముందు, నది మెట్ల ఎదుట పరిసర ప్రాంతాలు దుర్భరంగా మారడంతో ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సమయంలోనే జీవీఎంసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి ఈ ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్నారని, ఆ తరువాత కనీసం కన్నెత్తి చూడడం లేదనే విమర్శలున్నాయి. నదీ ప్రాంతం జీవీఎంసీ, కొత్తూరు పంచాయతీ పరిధిలో ఉండడంతో ఎవరికీ వారు పరిశుభ్రత బాధ్యత తమది కాదన్నట్టుగా వ్యవహరిస్తున్నారని, దీంతో పట్టణం మధ్య నుంచి నది ప్రవహిస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోందని వాపోతున్నారు. నది పరిశుభ్రతపై అధికారులు స్పందించకపోయినా స్థానిక ప్రజా ప్రతినిధులైనా స్పందించాలని కోరుతున్నారు.

నిప్పులు చెరిగిన భానుడు


మాకవరపాలెం, కోటవురట్లలో 41.8 డిగ్రీలు నమోదు

- మరో ఐదు మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు
- అల్లాడుతున్న జిల్లా వాసులు



ఎండతో నిర్మానుష్యంగా బుచ్చయ్యపేట మండలం వడ్డాది కూడలి

అనకాపల్లి, మే 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత వారం రోజులుగా ఎండల తీవ్రతతో పాటు ఉక్కబోతతో జనం అల్లాడిపోతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో పాటు వడగాల్పులు వీయడంతో ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. జిల్లాలో 24 మండలాలు ఉండగా వాతావరణ కేంద్రం గణాంకాల ప్రకారం శుక్రవారం ఎనిమిది మండలాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా మాకవరపాలెం, కోటవురట్ల మండలాల్లో 41.8 డిగ్రీలు, రోలుగుంట 41.3, కె.కోటపాడు, దేవరాపల్లి, చోడవరం మండలాల్లో 40.8, రావికమతం మండలంలో 40.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగిలిన మండలాల్లో 36 నుంచి 39 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కాగా గుబురు ఎండల కారణంగా జనం పగటిపూట బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు.



ప్రమాదానికి కారణమైన లారీ

మృత్యు శకటం

నిద్రిస్తున్న వారి పైనుంచి వెళ్లిన ఫ్లైయాష్ లారీ

- క్లీనర్ మృతి... మరొకరి పరిస్థితి ఆందోళనకరం
- సింహాద్రి ఎన్టీపీసీ యాష్‌పాండ్ వద్ద ఘటన



ప్రమాదంలో మృతి చెందిన వారా వినయ్‌కుమార్

పరవాడ, మే 31: ఉపాధి చూపించి ఆసరాగా నిలిచిన లారీయే మృత్యు శకటమై అతడి ప్రాణాలు బలిగొంది. ప్రమాదకరంగా లారీల మధ్య నిద్రపోవడం, గమనించని డ్రైవర్ లారీని నడిపించడంతో క్లీనర్ మృతిచెందగా మరొకరు తీవ్రగాయాలతో ఆస్పత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నారు. ఈ సంఘటన సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన యాష్‌డైక్ లగూన్-4 వద్ద గురువారం రాత్రి జరిగింది. పరవాడ సీఐ బాల సూర్యారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన యాష్‌డైక్ నుంచి ఫ్లైయాష్‌ను తీసుకెళ్లేందుకు ప్రతి రోజూ వందలాది లారీలు వస్తుంటాయి. ఎప్పటిలాగే గురువారం రాత్రి లోడు కోసం వచ్చిన లారీలను డైక్ వద్ద వరుస క్రమంలో నిలిచి ఉంచారు. వేర్వేరు లారీలకు చెందిన క్లీనర్లు వారా వినయ్‌కుమార్ (19), ఎం.దిలీప్‌కుమార్ (24) రాత్రి 11 గంటల సమయంలో లారీల మధ్య గ్యాప్‌లో నిద్రపోయారు. ఈ విషయాన్ని గమనించని లారీ డ్రైవర్ చందక రమణబాబు యాష్ లోడు కోసం లారీని తీశాడు. వాహనం నిద్రిస్తున్న క్లీనర్లపైనుంచి వెళ్లిపోవడంతో చక్రాల కింద ఇద్దరూ నలిగిపోయారు. గమనించిన స్థానికులు హుటాహుటిన క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించగా, అప్పటికే వినయ్‌కుమార్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దిలీప్‌కుమార్‌కు ప్రథమ చికిత్స అందించి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మృతుడు వినయ్‌కుమార్ స్వస్థలం మాకవరపాలెం మండలంలోని గిడుతూరు. కొంతకాలంగా లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. కాగా ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వినయ్‌కుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి శనివారం కుటుంబసభ్యులకు అప్పగిస్తామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. క్లీనర్ వినయ్‌కుమార్ కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని, చికిత్స పొందుతున్న దిలీప్‌కుమార్‌కు మెరుగైన వైద్యసేవలందించాలని డిమాండ్ చేశారు. సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

క్రైం... crime news

సరదాగా స్నేహితుడితో వచ్చి...

- హైవేపై లారీలో ఇద్దరు అనుమానాస్పద మృతి
- మృతులు అనకాపల్లి జిల్లా వాసులు
- అతి మద్యం, వడదెబ్బ కారణమని అనుమానం
- లారీ డ్రైవర్ ఫిర్యాదుపై కేసు నమోదు

జగ్గయ్యపేట/పెనుగంచిప్రోలు, మే 31: అతిగా మద్యం సేవించటంతో పాటు వడదెబ్బకు గురై లారీలో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన జాతీయ రహదారిపై నవాబుపేట సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. అనకాపల్లి నుంచి జగ్గయ్యపేటకు బొగ్గులోడ్‌తో గురువారం రాత్రి బయల్దేరిన లారీలో డ్రైవర్ కనగాల అప్పారావుతో పాటు ఆయన స్నేహితులు పాటు నర్సింగరావు, సత్యనారాయణలు సరదాగా వస్తామని బయల్దేరారు. బయల్దేరినప్పటి నుంచి వారిద్దరు మద్యం సేవించటం, గత రెండు రోజులగా ఎండ వేడిమి తీవ్రంగా ఉండటం, వడగాడ్పులకు శుక్రవారం మధ్యాహ్నం నుంచి నీరసపడ్డారని డ్రైవర్ చెబుతున్నాడు. హైవేపై నవాబుపేట వద్ద సాయంత్రం వారిద్దరు లారీలో ఎంత లేపిన లేవకపోవటంతో అనుమానం వచ్చి చూడగా అపస్మారకస్తితిలో ఉన్నారని, అంబులెన్స్‌లో జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు చెప్పారు. అక్కడ వారు చనిపోయినట్టు గుర్తించారు. నర్సింగరావు(55) ఎస్‌బీఐలో సెక్యూరిటి గార్డ్‌గా పనిచేస్తూ సస్పెన్షన్‌లో ఉన్నాడని, సత్యనారాయణ (63) విశాఖస్టీల్‌ప్లాంట్‌లో పనిచేసి రిటైరై ఖాళీగా ఉంటున్నాడని డ్రైవర్ తెలిపాడు. లారీ జగ్గయ్యపేటకు చెందిన ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టుది కాగా, ఇక్కడ నుంచి సిమెంట్ లోడ్‌తో వైజాగ్ వెళ్లి తిరుగుముఖంలో బొగ్గులోడ్‌తో వస్తున్నట్టు డ్రైవర్ చెప్పారు. పెనుగంచిప్రోలు పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని విచారిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేస్తున్నట్టు చెప్పారు.

బాలికపై అత్యాచారం

- నిందితుడు అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

అనకాపల్లి, మే 31: పాయకరావుపేట మండలంలోని ఒక గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం నర్సీపట్నం డీఎస్పీ జీఆర్‌ఆర్ మోహన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం మండలానికి చెందిన 14 సంవత్సరాల బాలిక మూడేళ్లుగా పాయకరావుపేట మండలంలో నానమ్మ, తాతగారి ఇంట్లో ఉంటూ చదువుకుంటోంది. ఈ ఏడాది 8వ తరగతి పూర్తిచేసిన బాలిక వేసవి సెలవులకు తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. తాతకు దగ్గర బంధువైన 35 ఏళ్ల వయస్సు వ్యక్తి తరచూ ఇంటికి వచ్చేవాడని, ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇంట్లో ఒంటరిగా ఉన్న తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని బాలిక తన తల్లికి చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం ఇక్కడకు వచ్చి పెద్దమనుషుల సమక్షంలో నిందితుడిని నిలదీయగా అతను బుకాయించాడు. అంతేకాకుండా బాలిక తల్లిదండ్రులపై దాడి చేశాడు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు నర్సీపట్నం డీఎస్పీ మోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

రాంబిల్లి, మే 31: మండలంలోని జంగాలపాలెం సమీపంలోని లోటస్ స్కూల్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వైలోకు చెందిన బద్ది దుర్గ (35) తీవ్రంగా గాయపడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం సుమారు 11:30 గంటల ప్రాంతంలో జంగాలపాలెం సమీపంలోని లోటస్ స్కూల్ వద్ద దుర్గ బస్సు దిగి రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో దుర్గకు తీవ్ర గాయాలయ్యాయి, విషయం తెలుసుకున్న రాంబిల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన మహిళ దుర్గను విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దుర్గ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ ముకుందరావు తెలిపారు.

మూడు తులాల బంగారు ఆభరణాలు చోరీ

నర్సీపట్నం, మే 31: మెడలోని బంగారు ఆభణాల చోరీపై ఇక్కడి బలిఘట్టం గ్రామానికి చెందిన సుర్ల బెన్నయ్యనాయుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం ప్రకారం వివరాలివి. గురువారం రాత్రి భార్య, పిల్లలతో కలిసి తమ ఇంటి డాబాపై నిద్రపోయామన్నారు. అర్ధరాత్రి సమయంలో తన భార్య రాజేశ్వరి మెడలోని రెండు తులాల పుస్తెలతాడు, తులం శతమానాలు కనిపించడం లేదని వాపోయిందన్నారు. ఈ ఘటనపై శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

20 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కశింకోట, మే 31: మండలంలోని తాళ్లపాలెం గ్రామ శివారున మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం తనిఖీలు నిర్వహిస్తుండగా అచ్చెర్ల గ్రామానికి చెందిన చందనాల రాజు పది మద్యం క్వార్టర్ బాటిళ్లు, జమ్మాదులపాలెం గ్రామానికి చెందిన డి.ఈశ్వరరావు 10 మద్యం క్వార్టర్ బాటిళ్ల తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ శివానంద


శివానందను పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.శివానంద నియమితులయ్యారు. ఆస్పత్రిలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సూపరింటెండెంట్ అశోక్ కుమార్ నెల రోజులు సెలవు పెట్టారు. ఈ సెలవు కాలానికి సూపరింటెండెంట్‌గా ఆర్థో విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ శివానందను నియమిస్తూ డీఎంఈ ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సూపరింటెండెంట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే డీసీఎస్ ఆర్ఎంవోగా డాక్టర్ ఎం.శంకరరావు నియమితు లయ్యారు. ఆయన సుదీర్ఘకాలంగా సెలవులో ఉన్నారు. కొద్దిరోజుల కిందట వరకు ఆ స్థానంలో పనిచేసిన లక్ష్మీ తులసిని ఆరోపణలపై సరండర్ చేసిన విషయం తెలిసిందే.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	123.00
లైవ్ ధర	143.00
విత్ స్కిన్	256.00
స్కిన్ లెస్	266.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

14 గ్రామాల్లో తాగునీటి కష్టాలు

- మూడు పెద్ద మోటర్లు ఒకేసారి కాలిపోడంతో వారం రోజులుగా అవస్థలు
- అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం

లచ్చన్నపాలెం సర్పానదిలో టీడీపీ హయాంలో భారీ తాగునీటి ప్రాజెక్టు ఏర్పాటు


లచ్చన్నపాలెం సర్పానదిలో ఉన్న భారీ తాగునీటి ప్రాజెక్టు

మాకవరపాలెం, మే 31: ఎండలు మండుతుండడంలో పలు గ్రామాల్లో తాగునీటి కష్టాలు తీవ్రమయ్యాయి. కొన్నిచోట్ల భూగర్భ జలాలు అడుగంటుతుండగా, మరికొన్ని గ్రామాల్లో మోటార్లు పాడై ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. ఫలితంగా బిందెడు నీటి కోసం మహిళల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మాకవరపాలెం మండలంలోని లచ్చన్నపాలెంలో గల భారీ తాగునీటి ప్రాజెక్టుకు సంబంధించిన మోటర్లు కాలిపోయాయి. దీంతో వారం రోజులుగా 14 గ్రామాల ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లచ్చన్నపాలెంలో గల సర్పానదిలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.పది కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టు నిర్మించారు. దీని ద్వారా పద్నాలుగు గ్రామాలకు తాగునీరు అందేది. ఈ ప్రాజెక్టుకు మూ డు పెద్ద మోటార్లు, రెండు చిన్న మోటార్లను ఏర్పాటు చేశారు. ఇటీవల ఇక్కడి మూడు పెద్ద మోటర్లు ఒకేసారి కాలిపోయాయి. దీంతో వారం రోజులుగా మండలంలోని మాకవరపాలెం, లచ్చన్నపాలెం, దాలింపేట, పైడిపాల, తామరం, పెద్దిపాలెం, బూరుగుపాలెం, చామంతిపురం, తాడపాల, తూటిపాల, మామిడిపాలెం, పోతలూరు, అడిగర్లపాలెం, పాపయ్యపాలెం తదితర గ్రామాలను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. మండు వేసవిలో తాగునీటికి కష్టాలు పడుతున్నా మోటార్ల మరమ్మతుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడం ఏమిటని ఆయా గ్రా మాల మహిళలు ఆగ్రహం వ్య క్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మోటార్లను బాగుచేయించి, తమ తాగునీటి కష్టాలు తీర్చాలని పద్నాలుగు గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.



గొలుగొండ మండలం జమ్మాదేవిపేటలో...

గొలుగొండ: మండలంలోని పప్పుశెట్టిపాలెం పంచాయతీ శివారు జమ్మాదేవిపేటలో నెల రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ సుమారు యాభై కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. ఇంటింటికీ నీటిని అందించేందుకు టీడీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి పథకం ఏర్పాటు చేశారు. భారీ ట్యాంకు నిర్మించి మోటారు ద్వారా దానికి నీటిని మళ్లించేవారు. ఆ తరువాత కుళాయిల ద్వారా ఇంటింటికీ సరఫరా చేసేవారు. నెల రోజుల క్రితం ఈ పథకానికి సంబంధించిన మోటారు పాడైంది. దీంతో నాటి నుంచి నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నామని మహిళలు వాపోతున్నారు. అలాగే గ్రామంలో రెండు చేతిబోర్లు ఏర్పాటు చేశారు. వాటిలో ఒకటి భూగర్భ జలాలు అడుగంటడంతో నిరుపయోగంగా మారింది. సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారని గ్రామస్థులు వాపోతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి మోటారుకు మరమ్మతులు చేయించాల్సిందిగా అంతా కోరుతున్నారు.



రహదారికి ఇరువైపులా చెట్ల నరికివేత

- ఉపాధి హామీ నిధులతో పెంచామన్న ఏపీవో
- విద్యుత్ స్తంభాల ఏర్పాటు పేరుతో తొలగించారని ఆగ్రహం
- పర్యావరణ విభాగం, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వెల్లడి



వైడీపేట వద్ద తాండవ జంక్షన్- నాతవరం రహదారి పక్కన చెట్లను నరికిన దృశ్యం

నాతవరం, మే 31: ఇక్కడి తాండవ జంక్షన్- నాతవరం ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఉపాధి హామీ నిధులతో పెంచిన చెట్లను నరికి వేయడంపై పర్యావరణ విభాగం అధికారులకు, నాతవరం పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామని నాతవరం మండల ఉపాధి హామీ పథకం ఏపీవో చిన్నారావు శుక్రవారం తెలిపారు. ప్రయాణికులకు నీడనివ్వాలన్న ఉద్దేశ్యంతో మూడేళ్ల క్రితం రెండు లక్షల రూపాయల ఉపాధి హామీ పథకం నిధులతో తాండవ జంక్షన్- నాతవరం ఆర్‌అండ్‌బీ రోడ్డులో వైడీపేట (మర్రిపాలెం) నుంచి నాతవరం వరకు రెండు వైపులా 1100 మొక్కలు నాటామన్నారు రోజూ నీరు పోసి, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పెంచినట్టు చెప్పారు. తాము రోడ్డుకు రెండు వైపులా మొక్కలు నాటినప్పటికి విద్యుత్ స్తంభాలు లేవన్నారు. అయితే కొత్తగా విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు గోతులు అవసరం కావడంతో పెంచిన చెట్లను నరికివేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఎప్పుడైనా విద్యుత్ వైర్లకు కొమ్మలు అడ్డువస్తే ఆ కొమ్మలను మాత్రమే నరుకుతారన్నారు. కానీ ఇలా కష్టపడి పెంచిన చెట్లను నరకడం తగదన్నారు. తమ అనుమతి లేకుండా చెట్లు నరికి వేసిన వ్యక్తులపై పర్యావరణ అధికారులకు, నాతవరం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఏపీవో చిన్నారావు వెల్లడించారు.

గొడవలను ప్రేరేపిస్తున్న సజ్జలను అరెస్టు చేయాలి

- పట్టణ సీఐకు మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్ ఫిర్యాదు


సీఐకు ఫిర్యాదు చేస్తున్న బుద్ద నాగజగదీష్

అనకాపల్లి టౌన్, మే 31: ఓట్ల లెక్కింపు జరిగే నాల్గో తేదీన ఎన్నికల నిబంధనలను పాటించాల్సిన అవసరం లేదని వైసీపీ కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన సజ్జల రామకృష్ణారెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణ సీఐ జి.శంకరరావుకు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఓడిపోతున్నామన్న భయంతో కౌంటింగ్ హాల్‌లో నిబంధనలు పాటించాల్సిన అవసరం లేదని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటి వరకు అధికార దర్పం, అహంకారంతో విర్రవీగారని, అరాచక పాలన సాగిస్తూ తెలుగుదేశం పార్టీ శ్రేణులపై దాడులు, ఆస్తినష్టం, ఊరిలోంచి తరిమి వేసిన ఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశారన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలంతా కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని, రాష్ట్ర అభివృద్ధిని చూడాలని, నిరుద్యోగ నిర్మూలనకు చంద్రబాబు సరైన నాయకుడని గుర్తించారని పేర్కొన్నారు. ఎన్నికలు జరిగి పది రోజుల వరకు మాట్లాడని సజ్జల వైసీపీ సమావేశంలో పార్టీ శ్రేణులను రాష్ట్రమంతటా అల్లకల్లోలం చేయాలని పిలుపునిచ్చారన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డిని అదుపులోకి తీసుకుని జరిగిన సంఘటనలపై విచారణ చేయాలని నాగజగదీశ్వరరావు డిమాండ్ చేశారు. సీఐను కలిసిన వారిలో టీడీపీ నాయకులు మళ్ల గణేష్, బొడ్డేడ మురళీ, బుద్ద కాశీ, విల్లూరి రమణబాబు, బుద్ద భువనేశ్వరరావు ఉన్నారు.

చెరకులో అధిక దిగుబడులకు మేలైన రకాలు ఎంపిక చేసుకోవాలి

- అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆర్‌డీ డాక్టర్ పీవీకే జగన్నాథరావు


చెరకు రైతులకు ఎరువులు పంపిణీ చేస్తున్న డాక్టర్ పీవీకే జగన్నాథరావు

సబ్బవరం, మే 31: చెరకులో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు మేలైన రకాలు ఎంపిక చేసుకోవాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం రీజినల్ డైరెక్టర్ పీవీకే జగన్నాథరావు సూచించారు. శుక్రవారం స్థానిక జాగృతి సొసైటీ ఆధ్వర్యంలో 'అఖిల భారత పరిశోధన సమన్వయ పథకం' ద్వారా ఎస్‌సీ చెరకు రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బెల్లం దిగుబడి పెరిగి, అధిక లాభాల కోసం సాగు విస్తీర్ణం పెంచడంతో పాటు మెరుగైన విత్తన ఎంపిక అవసరమన్నారు. అంతకుముందు శాస్త్రవేత్తలు ఆదిలక్ష్మి, విశాలాక్షి, చంద్రశేఖర్ చెరకు తెగుళ్ల నివారణ చర్యలపై 70 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం రైతులకు ఎరువుల, వర్మీ కంపోస్టు బస్తాలు, స్ప్రేయర్లు, స్టీల్ బకెట్లు, బెల్లం కలుపుకునేందుకు డ్రమ్ములు అందజేశారు. జాగృతి ఎండీ కందర్ప సుజాత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాగృతి కన్సల్టెంట్ వీవీ సుబ్రహ్మణ్యం, సీఈవో కేఎల్ఎస్ మౌక్తిక, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లకు నోటీసులు

- ఈఓపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్


పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న ఈఓ పీఆర్డీ చంద్రశేఖర్

పాయకరావుపేట, మే 31: మండలంలో ఎటువంటి అనుమతులు లేకుండా వేస్తున్న అక్రమ లేఅవుట్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేయాలని ఈఓపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం పాయకరావుపేట, అరట్లకోట, పీఎల్.పురం, సీతారాంపురం, శ్రీరాంపురం, పాల్మన్‌పేట, పెదరాంభద్రపురం పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అక్రమ లేఅవుట్లపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి అనుమతుల్లేకుండా లేఅవుట్లు వేస్తున్న వారికి తక్షణం నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. వ్యవసాయ భూములను లేఅవుట్లుగా అభివృద్ధి చేయాలనుకున్నవారు అన్ని అనుమతులు తీసుకున్న తరువాతనే పనులు చేపట్టాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కార్యదర్శులు జె.చంద్రశేఖర్, వై.సత్యనారాయణ, బీఏబీఎల్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలో కార్డెన్ సెర్చ్


- 28 వాహనాలు సీజ్


పట్టుబడిన వాహనాలతో పోలీసులు

పరవాడ, మే 31: గొర్లివానిపాలెం పంచాయతీ పరిధిలోని జేఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలో శుక్రవారం పరవాడ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు సీఐ బాల సూర్యారావు ఆధ్వర్యంలో పోలీసులు ఉదయం ఐదు నుంచి పది గంటల వరకు కాలనీలో తనిఖీలు చేశారు. ఎటువంటి రికార్డులు లేకుండా ఉన్న 28 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు మల్లేశ్వరరావు, శ్యామలరావు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

హోటల్, పండ్ల దుకాణాలపై దాడులు

- మొత్తం 20 నమూనాలను సేకరించాం
- ఆహార భద్రతా విభాగం అధికారి రవికుమార్


ఓ దుకాణంలో వివరాలు నమోదు చేస్తున్న రవికుమార్

నర్సీపట్నం, మే 31: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గల ఓ హోటల్, అబీద్ సెంటర్‌లోని పండ్ల దుకాణాలపై ఆహార భద్రతా సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్-2 ఆహార భద్రతా అధికారి బి.రవికుమార్ మాట్లాడుతూ పాడైన చట్నీ వేశారని ఓ వినియోగదారుడు వాట్సాప్ ద్వారా తెలిపిన సమాచారం మేరకు సదరు హోటల్‌లో ఐదు శాంపిల్స్ సేకరించామన్నారు. అలాగే పండ్లను మగ్గ పెట్టడానికి రసాయనాలు వినియోగిస్తున్నారని వస్తున్న ఫిర్యాదులతో పండ్ల దుకాణాలలో 15 నమూనాలు సేకరించినట్టు చెప్పారు. మొత్తం ఇరవై నమూనాలను ల్యాబ్‌కి పంపించామని, వచ్చిన రిపోర్టు ఆధారంగా చర్యలు చేపడతామని ఆయన వివరించారు.

ఉపాధి కూలీలకు బడ్జెట్‌లో నిధులు పెంచాలి

- రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ


మాట్లాడుతున్న సూర్యనారాయణ

అచ్యుతాపురం, మే 31: ఉపాధి హామీ కూలీలకు బడ్జెట్‌లో నిధులు పెంచి మౌళిక సదుపాయాలను కల్పించాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రెపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం పెదపాడులో ఉపాధి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దినసరి కూలీ స్లిప్‌లు గతంలో ఇచ్చేవారని, దీని వల్ల తమకు రోజుకు ఎంత కూలి వస్తుందే తెలిసేదన్నారు. ప్రస్తుతం స్లిప్‌లు ఇవ్వడం లేదన్నారు. కూలీలకు కనీసం తాగునీరు కూడా ఇవ్వడం లేదన్నారు. ఉపాధి కూలీలకు ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, తిరుపతమ్మ, కోదండమ్మ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోటవురట్లలో కార్డెన్ సెర్చ్


కోటవురట్లలో పోలీసులు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు

కోటవురట్ల, మే 31: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శుక్రవారం కోటవురట్ల జంక్షన్‌లో సీఐలు అప్పన్న, విజయకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాలతో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో ఎటువంటి పత్రాలు లేని 150 వాహనాలను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం తెల్లవారు జామున నుంచి కోటవురట్ల, రెల్లివీధి, గవరపేట, సంతబయిల కోలావారి వీధి, ముస్లిం వీధిల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. రికార్డులు చూపిస్తే వాహనాలను తిరిగి అందజేస్తామన్నారు. స్వాధీనం చేసుకున్న 150 వాహనాల్లో 110 వాహనాలకు రికార్డులు ఉండగా.. 40 వాహనాలకు రికార్డులు లేవన్నారు. రికార్డు లేని వాహనాలు సీజ్ చేసి కోటవురట్ల పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్నామన్నారు. కార్డెన్ సెర్చ్‌ను ఎస్ఐలు విభూషణరావు(ఎస్.రాయవరం), జోగారావు (పాయకరావుపేట), రమణయ్య(కోటవురట్ల), నాలుగు స్టేషన్ల పోలీసు సిబ్బంది నిర్వహించారు.

ఐదు మాసాల్లో 120 మంది ఆదివాసీల హత్య

- నిజ నిర్ధారణ కమిటీని అడ్డుకున్న పోలీసు బలగాలు
- బెదిరింపులు, బుజ్జగింపులు
- రాజ్యం పోలీసుల నిర్భందఖాండను ఖండిద్దాం
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక స్టీరింగ్ కమిటీ ఆరోపణ


ప్రధాన రహదారిపై బైఠాయించిన ఆదివాసీ హక్కుల పోరాట కమిటీ సభ్యులు

చింతూరు, మే 31: ఛత్తీస్‌గఢ్‌లో గత ఐదు మాసాలుగా మారణకాండ జరుగుతోందని, ఈ క్రమంలో మావోయిస్టుల ముద్రవేసి 120 మంది ఆదివాసీలను పోలీసు బలగాలు హత్య చేశాయని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆరోపించింది. ఈ మేరకు కమిటీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక నేతృత్వంలో 60 మందితో కూడిన నిజనిర్ధారణ కమిటీ గురువారం తెలంగాణ మీదుగా ఛత్తీస్‌గఢ్ చేరుకొని అక్కడి బాధిత కుటుంబాలను కలిసే ప్రయత్నం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ నారాయణరావు, మాదన కుమార స్వామి, జాబిలి (తెలంగాణ) నాయకత్వంలో బయలుదేరిన బృందాన్ని తెర్లగూడ వద్ద పోలీసు బలగాలు అడ్డుకున్నారన్నారు. భద్రతా కారణాలను సాకుగా చూపి వెనుతిరిగి వెళ్లాల్సిందిగా హెచ్చరించినట్లు ఆ ప్రకటనలో ఆరోపిం చారు. తామంతా ప్రయాణంతో అలసిపో యామని బీజాపూర్ చేరుకొని అక్కడ విశ్రాంతి తీసుకుంటామని ఎంతగా నచ్చచెప్పినా తమ మాటను పెడచెవిన పెట్టిన బలగాలు బెదిరింపులకు దిగాయని ఆరోపి ంచారు. చివరకు కమిటీని భద్రాచలం తిప్పి పంపారన్నారు. దీంతో శుక్రవారం వయా చింతూరు మీదుగా దంతెవాడ చేరుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని కుంట సరిహద్దున బలగాలు అడ్డుకోవడంతో పాటు తమను పారా మిలటరి బలగాలు చుట్టుముట్టా యన్నారు. దీంతో తాము రోడ్డుపైనే బైటాయిం చామని తెలిపారు. బలగాలు బుజ్జగించడం మొదలుపెట్టాయ న్నారు. ఛత్తీస్‌గఢ్‌లో తరచూ కాల్పులు జరుగుతున్నాయని అక్కడకు వెళ్లడం సరికాదంటూ బలగాలు చెప్పాయన్నారు. చివరకు అక్కడి నుంచి కూడా తమను వెనక్కు తిరిగి పంపారన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న మారణ ఖాండను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, హక్కులను బలగాలు ప్రభుత్వాలు కాలరాస్తు న్నాయని కమిటీ తీవ్రంగా ఖండించింది. తమను ఛత్తీస్‌గఢ్‌లోకి అనుమతించాల్సిందిగా వారు డిమాండ్ చేశారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS

PLOTS FOR SALE

★ గాజువాకకి 13 km లో ఎర్రచందనం మొక్కలతో ఫార్మ్ ల్యాండ్ కలదు. ఓపెనింగ్ ఆఫర్ - రిజిస్ట్రేషన్ ఫ్రీ. 111 గజాలు ఆపైన ప్లాట్స్ కలవు. సంప్ర: 9703900583
AJV_183381

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రజారోగ్యంతో చెలగాటం

- పట్టణంలో చికెన్ వ్యర్థాల నిల్వలు
- నాలుగు రోజులకొకసారి తరలింపు
- రవాణా సమయంలో తీవ్ర దుర్వాసన
- ఇలా చేస్తే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పట్టణవాసుల భయాందోళన
- పట్టించుకోని ప్రజారోగ్య శాఖ అధికారులు

ఎలమంచిలి, మే 31 : పట్టణంలోని పలు చికెన్ దుకాణాల్లో వ్యర్థాలు నిల్వ చేస్తూ ఒకేసారి తరలిస్తుండడంతో పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చికెన్ వ్యర్థాలు నిల్వ ఉంచడంతో అవి కుళ్లి దుర్వాసన అధికంగా వస్తున్నది. ఈ వ్యర్థాలను నాలుగు రోజులకు ఒకసారి రవాణా చేస్తుంటారు. ఈ సమయంలో వచ్చే దుర్వాసన కడుపులో తిప్పుతుందని పలువురు విలేకర్ల ఎదుట వాపోయారు. ఈ తరహా రవాణాను అధికారులు పట్టించుకోకుండా ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. పట్టణంలో రోజుల తరబడి చికెన్ వ్యర్థాలను నిల్వ ఉంచడంతో తీవ్ర దుర్వాసన, దోమలు పెరగడం, ఇతర రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక వ్యాపారులను అడిగితే చికెన్ వ్యర్థాలను స్థానికంగా కాకుండా ఇతర జిల్లాలకు వ్యాన్లలో తీసుకువెళ్లిపోతుంటారని చెబుతున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వాహనాల్లోకి చికెన్ వ్యర్థాలను ఎక్కిస్తున్న సమయంలో తీవ్ర దుర్వాసన వస్తుండడంతో మార్కెట్లో ఉన్న వారితో పాటు రోడ్డున పోయే వారు సైతం కడుపులో తిప్పినట్టు ఉంటుందని పలువురు తెలిపారు. ఈ విధంగా నిల్వ చేసిన చికెన్ వ్యర్థాలను చేపల పెంపకంలో వినియోగిస్తుంటారని కొందరు వ్యాపారులు తెలిపారు. చేపల పెంపకం కోసం వినియోగించే ఫీడ్ ఖరీదు కావడంతో ప్రత్యామ్నాయంగా కోళ్ల వ్యర్థాలను ఆహారంగా వినియోగిస్తున్నారని అంటున్నారు. సాధారణంగా చేప కిలోకు పైగా పెరిగేందుకు ఆరు నెలలు నుంచి ఎనిమిది నెలలు సమయం పడుతుందని, ఈ సమయంలో కోళ్ల వ్యర్థాలను ఆహారంగా వినియోగిస్తే నాలుగు నెలలకే కిలోకు పైగా బరువు పెరుగుతాయని అంటున్నారు.



ఎలమంచిలి దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద దుకాణం నుంచి చికెన్ వ్యర్థాలను వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

అందువల్లే ఇతర జిల్లాలకు చెందిన కొందరు ఈ చికెన్ వ్యర్థాలను తీసుకు వెళుతుంటారని అంటున్నారు. చికెన్ వ్యర్థాలను తరలించే సమయంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిత్య దర్శనీయ కేంద్రాలు గ్రంథాలయాలు

- విద్యా శాఖ ఆర్‌జేడీ బి. విజయభాస్కర్

అనకాపల్లి టౌన్, మే 31 : ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే గ్రంథాలయాలను నిత్య దర్శనీయ కేంద్రాలుగా విద్యార్థులు, యువత గుర్తించాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి. విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం గౌరీ గ్రంథాలయంలో కెరీర్ గైడెన్స్-భవిష్యత్తు అనే అంశం పై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జీవితమంతా గ్రంథాలయాలను సందర్శించాలన్నారు. ఆర్టీసీ, రైల్వేస్టేషన్‌ల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం లభించడానికి ప్రాచీన గ్రంథాలయాలే ముఖ్య భూమిక పోషించాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని టూరిస్టు, రెస్టారెంట్‌లకే కాదు గ్రంథాలయాలకు కూడా తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. అలాగే స్కూల్ స్థాయి నుంచి విద్యార్థులు తమ భవిష్యత్తు గురించి ఆలోచించాలని, కెరీర్ పట్ల అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న విజయభాస్కర్

పెంచుకోవాలన్నారు. గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సదస్సులో గ్రంథాలయ అధ్యక్షుడు దొడ్డి నూకఅప్పారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు తదితరులు పాల్గొన్నారు. నెల రోజులు పాటు కంప్యూటర్ శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. అలాగే విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

జైలు నుంచి వెళ్లిన తర్వాత సత్ప్రవర్తనతో మెలగాలి

- మొదటి అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి రమేష్

అనకాపల్లి టౌన్, మే 31: జైలు నుంచి బయటకు వెళ్లాక ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని 11వ అడిషినల్ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్, మొదటి అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి రమేష్ సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్‌లో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. జైలులో కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. లోపాలు ఏమైనా ఉంటే తెలియజేయాలని సూచించారు. ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే కోర్టు దృష్టికి తీసుకురావాలన్నారు. తెలిసి ఎవరూ తప్పు చేయకూడదని, దాని వలన జైలుకు వస్తే వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబం రోడ్డున పడుతుందని వివరించారు. కార్యక్రమంలో సబ్‌జైలు సూపరింటెండెంట్ గణేష్ రెడ్డి, న్యాయ సహాయకులు సాయిరాం, తులసీ, రోజా, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు.



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేష్

గుర్తింపు లేని పాఠశాలల పేర్లు ప్రకటించండి

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

అనకాపల్లి రూరల్, మే 31: జిల్లాలో గుర్తింపు లేని అన్ని యాజమాన్యాల పాఠశాలల వివరాలు ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభం కాకమునుపు బహిర్గతం చేయాలని విద్యాశాఖాధికారులను ఆదేశించినట్టు ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుర్తింపు లేని పాఠశాలల వివరాలు తెలుసుకోవడం బాలల హక్కు అన్నారు. ఇటువంటి పాఠశాలల్లో చేర్పించడం వల్ల పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరమే కాకుండా తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులకు గురి చేసిన వారవుతారన్నారు. ఆయా పాఠశాలల వివరాలు ప్రసార, ప్రచార, పత్రికలు, ఇతర సోషల్ మీడియా ద్వారా అందరూ తెలుసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గుర్తింపు పొందేందుకు తాత్సారం చేసే పాఠశాలల పై చట్ట ప్రకారం చర్యలతో పాటు క్రిమినల్ కేసులు పెట్టేందుకు వెనుకడుగు వేయవద్దని సూచించారు.

కొనసాగుతున్న పాలీసెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

అనకాపల్లి రూరల్, మే 31 : మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఐదో రోజు పాలీసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 59,001 నుంచి 75 వేల ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో 130 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించి ఐసీఆర్ పత్రాలను అందజేశారు. ఇందులో 75 మంది బాలురు ఉండగా.. 55 మంది బాలికలు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారన్నారు. శనివారం 75,001 నుంచి 92వేలు ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

చెస్ పోటీల్లో తేజకు ద్వితీయ స్థానం

అనకాపల్లి టౌన్, మే 31: మహారాష్ట్రలోని పూణేలో ఈనెల 24 నుంచి 26 వరకు జరిగిన అంతర్జాతీయ చెస్ పోటీల్లో స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి కందలం తేజ ద్వితీయ స్థానాన్ని దక్కించుకున్నారని కళాశాల ప్రిన్సిపాల్ డి. స్వాతి తెలిపారు. ఈ సందర్భంగా విజేతకు ట్రోఫీతో పాటు రూ.10వేలు నగదు బహుమతిని అందించారన్నారు. విద్యార్థి తేజను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి అభినందించారని ఆయన తెలిపారు.



విద్యార్థి తేజను అభినందించిన ప్రిన్సిపాల్ స్వాతి

‘ఆట పాటల్లో రాణిస్తే మంచి గుర్తింపు’

నక్కపల్లి, మే 31: బాల్యం నుంచే చదువుతో పాటు ఆట పాటల్లో రాణించే పిల్లలకు మంచి గుర్తింపు వుంటుందని పీఆర్‌టీయు జిల్లా ప్రతినిధి డీవీఎస్ రావు సూచించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పిల్లలకు నిర్వహించిన పలు పోటీలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాల్లో వున్న నీతి కథలు, చరిత్ర, జీకే బుక్స్‌ను చదవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గోవిందేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వైభవ వేంకటేశ్వర స్వామి కల్యాణం



వైభవ వేంకటేశ్వరస్వామికి కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, మే 31: స్థానిక అలివేలు మంగ పద్మావతి సమేత వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు హరి ఆధ్వర్యంలో శ్రీవారి వార్షిక కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అర్చకుడు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది హాజరు తప్పనిసరిగా వేయాలి

- ఎంపీడీవో కాశీవిశ్వనాథం



పందూరు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథం

కోటవురట్ల, మే 31: గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ హాజరు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథం ఆదేశించారు. శుక్రవారం కైలాసపట్నం, పందూరు గ్రామ సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది వచ్చేటప్పుడు, ఏదైనా పని మీద బయటకు వెళ్లినప్పుడు విధిగా హాజరు రికార్డులో నమోదు చేయాలన్నారు. లేకపోతే జీతాలు కోల్పోయే పరిస్థితి ఎదుర్కొంటారని హెచ్చరించారు. పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది హాజరును నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు.

పదవీ విరమణ పొందిన ఎస్ఐలకు వీడ్కోలు



పదవీవిరమణ పొందిన సిబ్బందితో ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, మే 31: జిల్లాల పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ముగ్గురు సిబ్బంది శుక్రవారం పదవీ విరమణ పొందారు. స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్ఐలుగా పనిచేస్తున్న ఎం.రామకృష్ణ, కె.వెంకటరావు, రావికమతం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న డి. అప్పారావులను జిల్లా పోలీస్ కార్యాలయంలో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ ముగ్గురు పోలీస్ శాఖలో అంకితభావంతో మంచి సేవలందించారని, సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు విజయభాస్కర్, సత్యనారాయణరావు పాల్గొన్నారు.

వడగాడ్పులకు జనం ఉక్కిరిబిక్కిరి



జనసందడి లేని అనకాపల్లి మెయిన్ రోడ్డు



నిర్మానుష్యంగా ఉన్న సబ్బవరం రోడ్డు

అనకాపల్లి టౌన్, మే 31 : అనకాపల్లి పట్టణంలో ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచే ఉష్ణతాపం ప్రారంభం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం అత్యధిక ఉష్ణోగ్రత 38 డిగ్రీలు, అత్యల్ప ఉష్ణోగ్రత 30 డిగ్రీలుగా నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి వడగాడ్పులు వీయడంతో వాహనాలపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఫ్యాన్ కింద కూర్చున్నా చెమటలు పడుతుండడంతో ప్రజలు అసహనానికి గురయ్యారు. ప్రధాన రహదారులు జన సందడి లేక బోసిపోయాయి. సాయంత్రం నాలుగు గంటల తరువాత వాతావరణం కొంత చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

పరవాడలో.. మండల కేంద్రంలో శుక్రవారం భానుడు నిప్పులు చెరిగాడు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు అల్లాడిపోయారు. ఎండ కారణంగా ఉదయం 11 గంటల కల్లా ప్రధాన రహదారులన్నీ బోసిపోయాయి. ఎండకు తోడు వేడి గాలులు వీయడంతో వృద్ధులు, చిన్నపిల్లలు, బాలింతలు అల్లాడిపోయారు. ఎండతో పాటు ఉక్కపోత తోడవ్వడంతో ఇళ్లల్లో ఉండలేక, బయటకు రాలేక ప్రజలు అవస్థలు పడ్డారు. ఎన్టీపీసీ, ఫార్మాసిటీ ప్రాంతాల్లో కూడా ఎండ తీవ్రత కొనసాగింది.

సబ్బవరంలో.. వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మరింత తీవ్రత పెరగడంతో ప్రజలు అల్లాడిపోయారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపడంతో ప్రజలు ఎండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎండ తీవ్రతకు వేడి గాలులు తోడవడంతో ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు రోజువారీ పనులు చేసుకునేందుకు అవస్థలు పడ్డారు. ప్రజల రాకపోకలు లేకపోవడంతో మండల కేంద్రం నిర్మానుష్యంగా మారింది.

‘మధ్యాహ్న భోజన తయారీలో జాగ్రత్తలు పాటించాలి’

ఎస్.రాయవరం, మే 31: మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం మండలంలోని అన్ని పాఠశాలల ఎండీఎం నిర్వాహకులకు ఓరియంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఏఎస్ఎస్ఏఎస్ మూర్తి మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం తయారీలో నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వంటకాలు తయారు చేసే సమయంలో తల వెంట్రుకలు పడకుండా చూసుకోవాలని, పరిశుభ్రతగా ఉంచుకోవాలన్నారు. రిసోర్స్ పర్సన్ ప్రసన్న ఆరు రోజులకు సంబంధించిన వీడియోలను ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా ప్రదర్శించారు. అనంతరం గ్యాస్ స్టవ్‌పై వంటకాలను తయారుచేసి ప్రదర్శించారు. అలాగే శిక్షణలో భాగంగా మధ్యాహ్న భోజన సిబ్బందితో వంటకాలను తయారు చేయించారు. వారు తయారు చేసిన వంటకాలను ఎంఈవో మూర్తి రుచి చూశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక పరిశీలకులు శేషుకుమార్ ట్రైనింగ్‌ను పరిశీలించారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో మూర్తి

నేడు హనుమాన్ జయంతి

పరవాడ, మే 31: స్థానిక సినిమాహాల్ జంక్షన్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం నిర్వహించనున్న హనుమాన్ జయంతికి సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధి బొద్దపు అయ్యబాబు తెలిపారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం ఐదు గంటల నుంచి స్వామివారి దర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద అన్నసమారాధన ఉంటుందన్నారు. దలాయిపాలెం, కలపాక, ఈ.బోనంగి, పరవాడ, గొర్లివానిపాలెం, తానాం, భరిణికం, పెదముషిడివాడ తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

ఎలమంచిలిలో.. మునిసిపాలిటీలో శనివారం హనుమన్ జయంతిని నిర్వహించేందుకు ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని అభయాంజనేయ స్వామి ఆలయంతో పాటు ద్వారకానగర్, ఫైర్ ఆఫీసు కాలనీ, రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయం వద్ద నెలకొల్పిన ఆంజనేయ స్వామి విగ్రహాల వద్ద హనుమాన్ జయంతిని నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పడమట గెడ్డ వద్ద పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

నక్కపల్లిలో.. మండలంలోని ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ అర్చకులు చెప్పారు.

నక్కపల్లి పోలీస్ స్టేషన్ వద్ద వున్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద కూడా హనుమజ్జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ఎలమంచిలి రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయం వద్ద ఆంజనేయ విగ్రహం



ప్రయాణికుల కోసం మజ్జిగ చలివేంద్రం



సత్యసాయి భజన మండలి ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రం

నక్కపల్లి, మే 31: మండు వేసవిలో హైవేపై ప్రయాణించే ప్రయాణికులు, పాదచారుల కోసం నక్కపల్లిలో సత్యసాయి భజన మండలి ప్రతీ శుక్రవారం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఎంతోమందికి దాహార్తిని తీర్చుతోంది. హైవే వద్ద పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. వందలాది మంది పాదచారులు, బైక్‌లపై ప్రయాణించే వారికి మజ్జిగను సరఫరా చేశారు. కార్యక్రమంలో కక్కిరాల సురేశ్, విశ్వేశ్వరావు, భగవాన్, కొత్త శ్రీను, కిరణ్,ఎస్.ఎస్.శర్మ, తదితరులు పాల్గొన్నారు.

‘పెన్షన్‌దారులకు ఇబ్బంది లేకుండా చూడాలి’

నక్కపల్లి, మే 31: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పెన్షన్లు తీసుకోవడానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకుల వద్ద ఏర్పాట్లు చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించాలని, వెల్ఫేర్ అసిసెంట్లు డ్రెస్ కోడ్ పాటించాలని ఆదేశించారు. సమావేశంలో ఏవో సీతారామరాజు, ఈవోఆర్‌డీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

‘మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలి’

నక్కపల్లి, మే 31: మరికొద్ది రోజుల్లో విద్యాసంవత్సరం ప్రారంభంకానుందని, మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టాలని ఎంఈవో కె.నరేశ్ సూచించారు. శుక్రవారం వేంపాడులో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ప్రతీ రోజూ పౌష్టికాహారం అందజేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం జిల్లా కో-ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టికాహారం అందిస్తున్నారనే భావన పిల్లల్లో కలగాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ బీటీ, నోడల్ హెచ్‌ఎం వేమగిరి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

హరిపాలెంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం



హరిపాలెం పీహెచ్‌సీలో పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

అచ్యుతాపురం, మే 31: మండలంలోని హరిపాలెం పీహెచ్‌సీ కేంద్రంలో శుక్రవారం పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొగాకు వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి కల్యాణి మాట్లాడుతూ ఎక్కువగా యువత పొగాకుకు బానిసవుతున్నారన్నారు. స్నేహితులతో సరదాగా పొగ తాగడం తర్వాత దానికి బానిసలుగా మారి యువత నిర్వీర్యం అవుతున్నారన్నారు. అనంతరం పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత, ఉమామహేష్, గణేష్, శాంతి, ఇందిర, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

దేశంశెట్టి మాతరాజు, S/o. నాగరాజు, వయస్సు 31 సం॥, రాజకోడూరు గ్రామం, రాంబిల్లి మండలం, అనకాపల్లి జిల్లా, అను నేను తేది.26-05-2024న రాజకోడూరు నుండి వెంకటాపురం జంక్షన్‌కు ఆటోలో వెళ్తుండగా నా పాస్‌పోర్టు (No. N9112869) పోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

9542970801, 8019682303

ఘనంగా పైడితలమ్మ ఆలయ వార్షికోత్సవం

సబ్బవరం, మే 31: మండలంలోని పెదగొల్లలపాలెం పైడితలమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి 108 కళశాలతో అభిషేకాలు, చండీ హోమం, చండీ పారాయణం, 12 గంటల నుంచి అన్న సమారాధన జరిగింది. సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు, సహస్ర నామార్చన, దీపాలంకరణ జరిగింది. అమ్మవారిని మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, పెందుర్తి నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్ బాబు దర్శించుకొన్నారు.

మహారాజశ్రీ అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

EP 1/2022 in OS 152/2010

కాండ్రేగుల నాగ వెంకట రామేశ్వరరావు ...DHR

అండ్

కాకరపల్లి ఉమా శ్రీనివాసరావు ...JDR

వేలం ప్రకటన

పై నంబరు అమలులో DHR కు రావాల్సిన అమలు బాకీ చెల్లించకపోవుటచే JDR యొక్క ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని తేది.18-06-2024న వేలం వేయుటకు శ్రీ కోర్టువారు నిర్ణయించియున్నారు. కావున ఆ రోజు ఉదయం 10-30 నిలకు పై కోర్టుకు హాజరై కోర్టు వారి షరతులకు లోబడి వేలం పాటలో పాల్గొనవలెను.

షెడ్యూల్ : విశాఖపట్నం జిల్లా, అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్, మునగపాక మండలం, నాగవరం పంచాయతీలో గల సర్వే నెం.176/16లో య.0-50 సెంట్లు విస్తీర్ణం గల మెట్టభూమికి హద్దులు. **తూర్పు:** పశువులకు పోవు బాట, **పడమర:** అల్లవరపు రామునాయుడు గారి మెట్ట భూమి, **ఉత్తరం:** పాలిసెట్టి రమణ యితరుల యొక్క భూమి, **దక్షిణం:** దొండపాటి వెంకటరావు షరాల భూమి.

DHR విలువ : రూ.4,00,000/-

అమీనా విలువ : రూ.5,20,000/-

మార్కెట్ విలువ : రూ.22,36,000/-

JDR విలువ : Nil

M.V. రెడ్డినాయుడు, DHR తరఫు అడ్వకేట్ అనకాపల్లి. సెల్ : 9247833057

డైట్‌లో డిప్లమో జాబ్ ఎచీవర్స్ డే



విద్యార్థులు, తల్లిదండ్రులను సత్కరించిన దృశ్యం

అనకాపల్లి టౌన్, మే 31: స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం డిప్లమో విద్యార్థులకు జాబ్ ఎచీవర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఆర్. వైకుంఠరావు మాట్లాడుతూ మల్టీ నేషనల్ కంపెనీల ఇంటర్వ్యూల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలన్నారు. డైట్‌లో ప్రాంగణ నియామకాలకు పెద్ద పీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. దుర్గా శ్యామ్ ప్రసాద్, కె. పార్వతి, కె. ఈశ్వరరావు, కృష్ణనాగ్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా బెట్టింగ్

... 5వ పేజీ తరువాయి

ఎవరూ ముందుకు రావడం లేదు. విజయనగరం ఎంపీ స్థానంపై మాత్రం జోరుగా పందాలు సాగుతున్నాయి. మొన్నటి వరకు వైసీపీ ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ గెలుస్తారంటూ పందాలు కాసిన ఎంతోమంది ఇప్పుడు సైలెంట్ అయిపోయారు. కూటమి అభ్యర్థి తరపున అధిక మొత్తాన్ని ఇస్తామని ఆఫర్ చేస్తున్నా వైసీపీ నుంచి ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ జిల్లాలోని ఎస్.కోట, నెల్లిమర్ల అసెంబ్లీ స్థానాల్లో ఫలితాలపై భారీగా పందాలు సాగుతున్నాయి.

కీలక స్థానాల్లో మెజారిటీపైనా..

రాష్ట్రంలో కీలక నియోజక వర్గాల్లో అభ్యర్థులు సాధించే మెజారిటీపైనా పెద్దఎత్తున పందాలు సాగుతున్నాయి. కుప్పంలో చంద్రబాబు, పులివెందులలో జగన్, పిఠాపురంలో పవన్‌కల్యాణ్ మెజారిటీలపై జోరుగా పందాలు సాగుతున్నాయి. వీరి ముగ్గురిలో ఎవరికి ఎక్కువ మెజారిటీ వస్తుందన్న దానిపైనా బెట్టింగ్ జరుగుతోంది. పిఠాపురంలో పవన్‌కల్యాణ్ కనీసం 30 వేలకుపైగా మెజారిటీ సాధి స్తారంటూ పందాలు కడుతున్నారు. అలాగే జనసేన పోటీ చేసిన స్థానాల్లో సగానికిపైగా గెలుచుకుంటుందని, రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, వైసీపీ లభించే ఎంపీ స్థానాలపై కూడా పందాలు సాగుతున్నాయి. కడపలో అవినాష్‌రెడ్డి గెలుపు/ ఓటమి, మెజారిటీపై కూడా పందాలు సాగుతున్నాయి.

చేతులు మారుతున్న రూ.కోట్లు..

గతంలో ఎన్నడూ పందాలు గురించి పట్టించుకోని ఎంతో మంది ఈసారి బెట్టింగ్‌కు ఆసక్తి చూపిస్తుండడం గమనార్హం. వీరిలో చిన్న, పెద్ద అంతా ఉన్నారు. రూ.5 వేల నుంచి రూ.కోటి, అంతకు మించి పందాలు సాగుతున్నాయి. ఏపీ అసెంబ్లీ ఎన్నికలపై రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.వేల కోట్ల బెట్టింగ్ జరిగినట్టు చెబుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు ఏపీలో జగన్ మరోమారు అధికారంలోకి వస్తారంటూ బెట్టింగ్ కడుతుండగా, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు కూటమి వైపు పందాలు కాస్తున్నారు. ఈసారి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా బెట్టింగ్‌లో భాగస్వామ్యులు కావడం గమనార్హం. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాల్లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూటమి గెలుస్తుందంటూ భారీ మొత్తంలో బెట్టింగ్ కట్టారు.

పాస్‌పోర్టు పోయినది

ఉత్తల రమేష్, S/o. కొత్తయ్యలు, వయస్సు 37 సం॥, డోర్ నెం.9-34, లక్ష్మీపురం, రాంబిల్లి, లాలంకోడూరు, అనకాపల్లి జిల్లా, అను నేను తేది.20-05-2024న అచ్యుతాపురం నుండి గాజువాక ఆటోలో వెళ్తుండగా నా పాస్‌పోర్టు (No. K2283757) పోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

9703664519

రోడ్డుపై సంత.. రాకపోకలకు చింత

▸ పట్టించుకోని అధికారులు ▸ ఇబ్బందుల్లో వాహనదారులు


ఏఎల్‌పురంలో సంత సందర్భంగా రోడ్డు పక్కన ఏర్పాటు చేసి దుకాణాలు

కృష్ణాదేవిపేట, మే 31 : గొలుగొండ మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో వారపు సంతతో జనం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై సాగుతుండడంతో వాహనదారుల అవస్థలు అధికంగా ఉన్నాయి. ప్రతి సోమవారం ఇక్కడ జరిగే సంతకు గొలుగొండ, కొయ్యూరు, జీకేవీధి మండలాలకు చెందిన రైతులు తాము పండించి కూరగాయాలను తీసుకు వస్తుంటారు. వీటి కొనుగోలుకు పట్టణప్రాంతాలకు చెందిన వ్యాపారులతో పాటు పరిసరాల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేస్తుంటారు. రహదారిపైనే అయా రైతులు దుకాణాలు పెడుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఏడాదికి సంత వేలంపాట ద్వారా రూ.లక్షల్లో ఆదాయం వస్తుంది. అయినప్పటికీ అధికారులు సరైన సౌకర్యాలను వ్యాపారులకు కల్పించలేకపోతున్నారని అంటున్నారు. గత్యంతరం లేక ప్లాస్టిక్ టార్పలిన్‌లతో ఎండ, వాన నుంచి రక్షణ పొందుతున్నామని వారంతా వాపోతున్నారు. ఇప్పటికైనా మండల పరిషత్ కార్యాలయ అధికారులు ప్రత్యేక ప్రదేశంలో సంతను ఏర్పాటు చేయడంతో పాటు సౌకర్యాలు కల్పించాల్సిందిగా వారంతా కోరుతున్నారు.

బ్రహ్మకమలాల వికాసం



మాడుగుల, మే 31 : మండల కేంద్రం మాడుగులలో బ్రహ్మకమలాలు వికసించాయి. మోదమాంబ కాలనీలో నివాసం ఉంటున్న చదలవాడ సుధాకర్, జయమ్మ దం పతులు తమ ఇంటి పెరట్లో ఈ మొక్కలను పెంచుతున్నారు. గురువారం రాత్రి ఈ పుష్పాలు వికసించడంతో పరిసరాల వారు ఆసక్తికరంగా తిలకించారు. అలాగే ఇక్కడి విశ్వశాంతి జ్ఞాన పిరమిడ్ కేంద్రం వద్ద కూడా ఈ పూలు పూశాయి.

భారీగా బెట్టింగ్

... 5వ పేజీ తరువాయి

ఎవరూ ముందుకు రావడం లేదు. విజయనగరం ఎంపీ స్థానంపై మాత్రం జోరుగా పందాలు సాగుతున్నాయి. మొన్నటి వరకు వైసీపీ ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్ గెలుస్తారంటూ పందాలు కాసిన ఎంతోమంది ఇప్పుడు సైలెంట్ అయి పోయారు. కూటమి అభ్యర్థి తరఫున అధిక మొత్తాన్ని ఇస్తామని ఆఫర్ చేస్తున్నా వైసీపీ నుంచి ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ జిల్లాలోని ఎస్.కోట, నెల్లిమర్ల అసెంబ్లీ స్థానాల్లో ఫలితాలపై భారీగా పందాలు సాగుతున్నాయి.

కీలక స్థానాల్లో మెజారిటీపైనా..

రాష్ట్రంలో కీలక నియోజక వర్గాల్లో అభ్యర్థులు సాధించే మెజారిటీపైనా పెద్దఎత్తున పందాలు సాగుతున్నాయి. కుప్పంలో చంద్రబాబు, పులివెందులలో జగన్, పిఠాపురంలో పవన్‌కల్యాణ్ మెజారిటీలపై జోరుగా పందాలు సాగు తున్నాయి. వీరి ముగ్గురిలో ఎవరికి ఎక్కువ మెజారిటీ వస్తుందన్న దానిపైనా బెట్టింగ్ జరుగుతోంది. పిఠాపురంలో పవన్‌కల్యాణ్ కనీసం 30 వేలకుపైగా మెజారిటీ సాధి స్తారంటూ పందాలు కడుతున్నారు. అలాగే జనసేన పోటీ చేసిన స్థానాల్లో సగానికిపైగా గెలుచుకుంటుందని, రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, వైసీపీ లభించే ఎంపీ స్థానాలపై కూడా పందాలు సాగుతున్నాయి. కడపలో అవినాష్‌రెడ్డి గెలుపు/ ఓటమి, మెజారిటీపై కూడా పందాలు సాగుతున్నాయి.

చేతులు మారుతున్న రూ.కోట్లు..

గతంలో ఎన్నడూ పందాలు గురించి పట్టించుకోని ఎంతో మంది ఈసారి బెట్టింగ్‌కు ఆసక్తి చూపిస్తుండడం గమనార్హం. వీరిలో చిన్న, పెద్ద అంతా ఉన్నారు. రూ.5 వేల నుంచి రూ.కోటి, అంతకు మించి పందాలు సాగుతున్నాయి. ఏపీ అసెంబ్లీ ఎన్నికలపై రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.వేల కోట్ల బెట్టింగ్ జరిగినట్టు చెబుతున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఏపీలో జగన్ మరోమారు అధికారంలోకి వస్తారంటూ బెట్టింగ్ కడుతుండగా, కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు కూటమి వైపు పందాలు కాస్తున్నారు. ఈసారి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా బెట్టింగ్‌లో భాగస్వామ్యులు కావడం గమనార్హం. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాల్లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూటమి గెలుస్తుందంటూ భారీ మొత్తంలో బెట్టింగ్ కట్టారు.

పల్లె రహదారుల్లో ప్రమాద ఘంటికలు

▸ చాలా చోట్ల మలుపుల వద్ద పెరిగిన తుప్పలు, పిచ్చిమొక్కలు ▸ ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక ప్రమాదాలు
▸ ఎందరో గాయాలకు గురికాగా..., పలువురు మృత్యువాత ▸ జంగిల్ క్లియరెన్స్‌కు అధికారులు చర్యలు చేపట్టాలని జనం వేడుకోలు


ఎదురుగా వచ్చే వాహనాన్ని గుర్తించలేక ప్రమాదం జరిగిన దృశ్యం (ఫైల్)


మాడుగుల- ఎం.కోడురు మార్గంలో మలుపు వద్ద ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలు

మాడుగుల, మే 31 : పల్లె రహదారుల్లోని పలుచోట్ల మలుపులు వాహనచోదకులకు ప్రాణసంకటంగా మారుతున్నాయి. ఇరువైపులా ఏపుగా పెరిగిన తుప్పలు, పిచ్చిమొక్కల కారణంగా దగ్గరకు వచ్చే వరకు ఎదురుగా వస్తున్న వాహనాన్ని గుర్తించడం సాధ్యం కావడం లేదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ ఘటనల్లో ఎందరో గాయాలకు గురికాగా, పలువురు మృత్యువాత పడిన ఉదంతాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు మాడుగుల నుంచి ఎం.కోడురు గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో పలుచోట్ల మలుపులు ఉన్నాయి. వీటి వద్ద తుప్పలు పెరిగిపోవడంతో అటుగా రాకపోకలు సాగించేవారి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. ఇరుపక్కల నుంచి పలువురు ద్విచక్ర వాహనచోదకులు మితిమీరిన వేగంతో రావడం, ఇటువంటి ప్రాంతాల్లో ప్రమాదాలకు గురికాడం వంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. ఇటువంటి ప్రమాదాలు పగటిపూట జరిగితే అటుగా వెళ్లేవారు వెంటనే స్పందించి గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలించే అవకాశం ఉంటుంది. కొన్నిచోట్ల రాత్రివేళ గాఢాంధకారంగా ఉన్న చోట జరిగితే క్షతగ్రాత్రులు పరిస్థితి తలచుకుంటేనే దడపుడుతోంది. ఇదే విధంగా ఈ రోడ్డులోని ఓ మలుపు వద్ద ద్విచక్ర వాహనాలు ఢీకొని పలువురు గాయాలకు గురికాగా, ఓ వ్యక్తి మృత్యువాత పడిన సంఘటన కూడా ఉందని చెపుతున్నారు. అదీకాక చాలాచోట్ల పల్లెల నుంచి పాఠశాలలు, కళాశాలలకు విద్యార్థులకు సైకిళ్లపై వెళ్లి వస్తుంటారు. మలుపుల వద్ద వీరు సైతం ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయని అంటున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి పల్లె రహదారుల్లోని ఇటువంటి మలుపుల వద్ద తుప్పలను తొలగించడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధి పనులు కల్పించాలని కూలీల ఆందోళన


కొండపై ఆందోళన చేస్తున్న తాళ్ళచీడికాడకు చెందిన కూలీలు

కృష్ణాదేవిపేట, మే 31 : ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ గొలుగొండ మండలం లింగందొరపాలెం పంచాయతీ తాళ్ళచీడికాడ గ్రామానికి చెందిన పలువురు ఆందోళనకు దిగారు. శుక్రవారం వీరు ఉపాధి పనులు జరుగుతున్న కొండపోడు ప్రాంతానికి వెళ్లారు. అక్కడ పని కల్పించాలని కోరినా ఫలితం లేకపోవడంతో అదే కొండపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజులుగా తెల్లవారుజామున ఉపాధి పనికి కొండపోడు ప్రాంతానికి బయలుదేరి వెళుతున్నామన్నారు. ఎక్కడ పనిచేయాలని అధికారులకు ఫోన్ చేసి అడిగినా తమకు పనులు కల్పించడం లేదని వాపోయారు. దీనికి కారణం గ్రామంలో వందమంది ఉపాధి కూలీల్లో ఇద్దరు పనికి వచ్చి అనారోగ్యంగా ఉండడంతో ఇంటికి వెళ్లి పోయారన్నారు. పనులు తనిఖీల్లో భాగంగా బుధవారం టీసీ ప్రసాద్ వచ్చి పరిశీలించి ఇద్దరు కూలీలకు అదనంగా మస్తర్లు వేశారని భావించి, తమకు పనులు కల్పించకుండా తిప్పుతున్నారని కూలీలు ఆరోపించారు. ఈ విషయంపై ఉపాధి హామీ పథకం ఈసీ రాధికను వివరణ కోరగా, మస్తర్లు అదనంగా వేయడం వల్ల ఒకరోజు పని ఆపమని చెప్పామన్నారు. వారందరికీ ప్రభుత్వం నిబంధనల ప్రకారం పని కల్పిస్తామ న్నారు. దీని పై సీపీఐ జిల్లా సమితి సభ్యుడు జి.రాధాకృష్ణ మాట్లాడుతూ ఇక్కడ ఫీల్డ్ అసిస్టెంట్ లేక టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా పని కల్పించడం జరుగుతుందని, దీని వల్ల కూలీలు పనికి దూరమవుతున్నారని ఆరోపించారు. తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు భర్తీ చేయాలని, టెక్నికల్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పని ప్రదేశంలో కూలీలకు నీరు, మజ్జిగతో పాటు నీడ కోసం టెంట్ సౌకర్యం కల్పించాల్సిందిగా కోరారు.

కార్డన్ సెర్చ్‌లో 87 వాహనాలు సీజ్

▸ తెల్లవారుజామున రావికమతాన్ని దిగ్బంధం చేసిన పోలీసులు


రావికమతంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న రికార్డులేని వాహనాలు

రావికమతం, మే 31 : మండల కేంద్రం రావికమతంలో పోలీసులు శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజాము ఐదు గంటల నుంచి గ్రామాన్ని దిగ్బంధం చేశారు. సరిహద్దుల్లో పోలీసులు కాపలా కాసి, ఇంటింటికీ వెళ్లి వాహనాలకు సంబంధించిన పత్రాలపై ఆరా తీశారు. సరైన ధ్రువపత్రాలు లేని 87 వాహనాలను పట్టుకున్నట్టు కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ఇందులో ఏడు ఆటోలు, ఎనభై ద్విచక్ర వాహనాలు ఉన్నట్టు వివరించారు. వీటికి సంబంధించిన పత్రాలను చూపితే ఆయా యజమానులకు అందజేస్తామన్నారు. అనంతరం ఆయన గ్రామస్థులనుద్దేశించి మాట్లాడుతూ నాలుగో తేదీన ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున అంతా శాంతియుత వాతావరణంలో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రావికమతం, కొత్తకోట, రోలుగుంట, బుచ్చియ్యపేట ఎస్ఐలు ధనుంజయనాయుడు, లక్ష్మణరావు, సురేష్, ఈశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ


శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఎంఈవో జాన్ ప్రసాద్

రోలుగుంట, మే 31 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మోనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈవో జాన్ ప్రసాద్ సూచించారు. రోలుగుంట జడ్పీ పాఠశాలలో మండలంలోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శుక్రవారం ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. జూన్ 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయన్నారు. ప్రతి రోజూ విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో వంటలు చేసి వడ్డించాలన్నారు. ట్రైనర్ ఎస్‌కే బీబీ భోజనం తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం భోజనాల తయారీపై పోటీలు నిర్వహించి ప్రతిభ చూపినవారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'10న ఉపాధి కూలీల సమస్యలపై ఆందోళన'


సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

రావికమతం, మే31 : ఉపాధి కూలీలకు రోజు కూలి రూ.300 చెల్లించాలని, వారంలో ఆరు రోజులు మస్తర్లు వేయాలన్న డిమాండ్‌తో జూన్ పదోతేదీన గిరిజన సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన ఎంపీడీవో కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు పిలుపునిచ్చారు. టి.అర్జాపురం పంచాయతీ శివారు డోలవానిపాలెంలో ఆదివాసీ ఉపాధి కూలీలతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పన్నెండు పంచాయతీల్లో 41 ఆదివాసీ గ్రామాలలో 670 మంది ఆదివాసీలు జాబ్ కార్డులు కలిగి ఉన్నారన్నారు. వీరిలో 180 మందికి 2011లో అటవీ హక్కు చట్టం ద్వారా పట్టాలను అప్పటి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అలాగే మరో ఐదొందల మందికి రెండేళ్ల క్రితం ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇచ్చారన్నారు. ఈ పట్టాలు కలిగిన ప్రతి ఒక్క ఆదివాసీ ఉపాధి కూలీకి 150 రోజులు పనులు కల్పించాల్సి ఉందన్నారు. కానీ ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. దీనిని నిరసిస్తూ ఆందోళనకు పిలుపునిచ్చినట్టు చెప్పారు. పెద్ద ఎత్తున ఉపాధి కూలీలు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయుకులు వలసయ్య తదిరులు పాల్గొన్నారు.

హనుమజ్జయంతికి ఆలయాలు ముస్తాబు


బుచ్చెయ్యపేటలోని పంచముఖ ఆంజనేయుడి విగ్రహం

బుచ్చెయ్యపేట/ నాతవరం/దేవరాపల్లి, మే 31 : హనుమజ్జయంతిని పురస్కరించుకుని గ్రామ గ్రామాన గల రామాలయాలు, హనుమాన్ ఆల యాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా శనివారం వేకుజాము నుంచి స్వామివారికి పూజలు ప్రారంభం కానున్నాయి. ఇం దులో భాగంగా బుచ్చెయ్యపేట మండలం వడ్డాది, విజయరామరాజుపేట, లోపూడి, పొట్టిదొరపాలెం, కోమళ్లపూడి, దిబ్బిడి, బుచ్చెయ్యపేట, రాజాం, తురకలపూడి, నీలకంఠాపురం, పెదమదీన, గున్నెంపూడి తదితర గ్రామాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే, నాతవరంలో భారీగా ఏర్పాట్లు చేపట్టినట్టు ఆలయ ధర్మకర్త పైల పోతురాజు తెలిపారు. దేవరాపల్లి మండలం రైవాడ శివారు కొల్లివానిపాలెంలో హనుమాన్ పూజలకు ఏర్పాట్లు పూర్తిచేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

'ఎన్నికల కౌంటింగ్ రోజు సంబరాలు నిషేధం'

నర్సీపట్నం అర్బన్, మే 31 : సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకున్నామని, నాలుగో తేదీ మంగళవారం జరిగే కౌంటింగ్ రోజు కూడా ఇదే వాతావరణం గ్రామాల్లో నెలకొనాలని నర్సీపట్నం రూరల్ ఎస్ఐ ఐ.భీమరాజు సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కౌంటింగ్ ముందు, తరువాత గ్రామాల్లో విజయోత్సవాలు, సంబరాలు జరపరాదని, బాణసంచా కాల్చరాదని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అంతా అందుకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. నిబంధనలు అక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

చౌడువాడ పాఠశాల హెచ్‌ఎంకు సన్మానం


హెచ్‌ఎం సన్మాన సభలో మాట్లాడుతున్న ఎంఈవో

కె.కోటపాడు, మే 31 : చౌడువాడ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్లె అప్పారావు శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన సత్కార సభకు ముఖ్య అతిథిగా హాజరైన కె.కోటపాడు ఎంఈవో-2 డీవీడీ ప్రసాద్ ఆయన సేవలను ప్రశంసించారు. అనంతరం అప్పారావు దంపతులకు ఉపాధ్యాయులు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.

నాగయ్యపేట వీధుల్లో అంధకారం

▸ వెలగని వీధి లైట్లు ▸ పట్టించుకోని పంచాయతీ


వీధిలైట్లు వెలగక కారుచీకట్లో రాజులవీధి

దేవరాపల్లి, మే 31 : మండలంలోని నాగయ్యపేటలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చడంలో, వీధిలైట్లు వేయడంలో పంచాయతీ కార్యాలయం సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రధాన కూడలి రామాలయం వద్ద, రాజుల వీధిలో వీధి లైట్లు వెలగడం లేదని పంచాయతీ కార్యదర్శి దృష్టికి పదేపదే తీసుకు వెళ్లినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. పారిశుధ్య సమస్య కూడా వేధిస్తున్నట్టు చెప్పారు. అధికారులు తక్షణమే గ్రామంలో సమస్యలపై స్పందించాల్సిందిగా వారంతా కోరుతున్నారు.



భానుడి ప్రతాపానికి జనం విలవిల


వెలవెలబోతున్న బుచ్చెయ్యపేటలోని బీఎస్ రోడ్డు


ఎండ ధాటికి మధ్యాహ్నం నిర్మానుష్యంగా రావికమతం- తట్టబంద రహదారి

నర్సీపట్నం/ చోడవరం/ బుచ్చెయ్యపేట/ రావికమతం/ మాడుగుల/చీడికాడ/, మే 31 : వారం రోజులుగా భానుడి ప్రతాపానికి జనం విలవిల్లాడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే ఉక్కపోత ఉక్కిబిక్కిరి చేస్తోంది. ఫ్యాన్ కింద ఉన్నా చెమటలు ఆగడం లేదు. పది గంటలు దాటితే ఇంటి నుంచి బయటకు అడుగుపెట్టాలంటేనే హడలిపోతున్నారు. ఒకవేళ తప్పనిసరి స్థితిలో బయటకు వచ్చినవారు సైతం తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎండలకు జడిసి చాలాచోట్ల దుకాణాలను ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు, సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నిర్వహిస్తున్నారంటే పరిస్థితి ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలావుంటే, మధ్యాహ్నం పన్నెండు గంటల నుంచి రెండున్న గంటల వరకు రహదారులు పలుచోట్ల నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఉష్ణతాపానికి గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతంగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వరుణుడు ఎప్పడు కరుణ చూపుతాడా.. అని అంతా ఎదురు చూపులు చూస్తున్నారు..


నర్సీపట్నంలో ఎండ నుంచి ఇలా ఉపశమనం


సందడి లేని చోడవరంలోని మెయిన్ రోడ్డు

